సాక్షి
చిత్తూరు
బుధవారం । 9 । ఆగస్టు । 2023



అంతర్రాష్ట్ర రహదారికి మోక్షం
బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడులోని పేర్నాంబట్‌కు అంతర్రాష్ట్ర రహదారి సమస్య త్వరలోనే తీరనుంది. - 8లో



ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం
ప్రభుత్వ భవన నిర్మాణాలను సెప్టంబర్ 15 లోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	25
తిరుపతి	37	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

టీటీడీకి కూరగాయల వితరణ


దాతలకు ప్రసాదాలను అందజేస్తున్న పలమనేరు శ్రీవారి భక్తులు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం హొసూరు నుంచి తిరుమల టీటీడీ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రానికి పది టన్నుల కూరగాయలను పలమనేరు శ్రీవారి సేవకులు పంపించారు. హొసూరులోని రైతుల నుంచి వీటిని సేకరించి, దాతలకు శ్రీవారి ప్రసాదాలను అందించి కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ వాహనానికి పూజలు నిర్వహించి తిరుమలకు పంపారు.

నేటి ఆడికృత్తికకు ప్రత్యేక ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సహాయ కమిషనర్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని చెంగల్వరాయ కొండపై వెలసిన శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం జరిగే ఆడికృత్తిక ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఏర్పాట్లను మంగళవారం దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ ఏకాంబరం పరిశీలించారు. క్యూలు, వసతులపై దేవస్థానం ఈఓ సుబ్బారెడ్డి తో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఆడికృత్తిక దర్శనానికి భక్తులు అశేషంగా తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులు ఇబ్బంది లేకుండా సులభంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కల్పించాలని సూచించారు. తదితరులు ఉన్నారు.

మొదటిరోజు నామినేషన్లు నిల్

– మంగళవారం సెంటిమెంట్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 3 సర్పంచ్, 46 వార్డు స్థానాల ఎన్నికలకు తొలిరోజు మంగళవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ ఖాళీల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి గురువారం వరకు నామినేషన్ దాఖలాలు చేసే అవకాశం కల్పించారు. పోటీలో దిగనున్న అభ్యర్థులు తొలిరోజు మంగళవారం సెంటిమెంట్ పాటించారు. మొదటి రోజు జిల్లాలో ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదని డీపీఓ లక్ష్మి తెలిపారు. నామినేషన్ స్వీకరణ, తిరస్కరణ, అప్పీలు, అభ్యర్థుల పేర్ల ప్రకటన తర్వాత ఈనెల 19న ఎన్నికలు జరుగుతాయని వివరించారు.

సబ్సిడీతో చాప్‌కట్టర్లు


చాప్‌కట్టర్లు పంపిణీ చేస్తున్న అధికారులు

తవణంపల్లె: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా సబ్సిడీ ధరకు చాప్‌కట్టర్లు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఐరాల ఏడీ పద్మజ తెలిపారు. మంగళవారం తవణంపల్లె వెటర్నరీ హాస్పిటల్లో రాష్ట్రీయ క్రిషి వికాష్ యోజన పథకం కింద 46 మంది రైతులకు రాయితీ కింద చాప్‌కట్టర్(గడ్డి కత్తరించే యంత్రాలు)లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.13, 588 సబ్సిడీ ఇస్తోందని, రైతులు రూ.20,382 చెల్లిస్తే చాప్‌కట్టర్‌తో పాటు 2 హెచ్‌పీ మోటార్, మూడు బ్లేడ్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే చాప్‌కట్టర్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, వెటర్నరీ డాక్టర్లు లావణ్య, పల్లవి, వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్‌బాబురెడ్డి, పరమేశ్వర రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, డేవిడ్, పాడి రైతులు పాల్గొన్నారు.

వేగవంతంగా వ్యాక్సినేషన్

చిత్తూరు రూరల్: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టీకాల పంపిణీ కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని డీఐఓ రవిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు 516 కేంద్రాల ద్వారా 112 మంది గర్భిణులు, 433 మంది రెండేళ్లలోపు పిల్లలు, 314 మంది 5 ఏళ్ల లోపు పిల్లలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారు కూడా ఈ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పీటీఎం సమావేశాలతో.. స్కూళ్ల సమగ్రాభివృద్ధి

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. బోధనాభ్యాసన కార్యక్రమాలు, ప్రమాణాల పెంపు అంశాల్లోనూ భాగస్వాములను చేస్తూ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థుల అభ్యర్థన సామర్థ్యాలను తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈనెల 10వ తేదీన పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల, విద్యార్థుల సమస్యలు, లోపాలు ఉంటే సరిదిద్దుకునేందుకు ఈ సమావేశాలు మేలు చేకూర్చనున్నాయి.

- పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయం
- రేపు సర్కారు బడుల్లో 'పేరెంట్,టీచర్' సమావేశాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- మార్గదర్శకాలు జారీచేసిన రాష్ట్ర విద్యాశాఖ

నాడు : టీడీపీ పాలనలో సర్కారు బడుల అభివృద్ధిపై పట్టించుకున్న దాఖలాలు లేవు. బడుల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మొక్కుబడిగా ప్రకటనలు మాత్రమే. విద్యార్థుల ప్రగతిని తెలియజేసేందుకు తల్లిదండ్రుల కమిటీ సమావేశాల ఊసేలేదు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో అన్న విషయాలను తల్లిదండ్రులు తెలుసుకునే పరిస్థితి ఉండేది కాదు.

నేడు : సర్కారు బడులు బలోపేతం అయ్యాయి. బడుల బలోపేతానికి నాడు–నేడు కింద వైఎస్సార్ సీపీ సర్కారు వేల కోట్లను ఖర్చు చేసింది. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేసేందుకు నాలుగేళ్లుగా తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.


చిత్తూరు : పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

జిల్లా సమాచారం	
ప్రాథమిక పాఠశాలలు	1,918
చదువుతున్న విద్యార్థులు	63,311
ప్రాథమికోన్నత పాఠశాలలు	208
చదువుతున్న విద్యార్థులు	15,232
ఉన్నత పాఠశాలలు	352
చదువుతున్న విద్యార్థులు	85,358
మొత్తం పాఠశాలలు	2,478
మొత్తం విద్యార్థులు	1,63,901

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలియజేసేందుకు పేరెంట్, టీచర్స్ సమావేశాలకు విద్యాశాఖాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,918 సర్కారు బడులున్నాయి. ఇందులో 1,63,901 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈనెల 10వ తేదీన పేరెంట్స్,టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి పాఠశాలల్లో కచ్చితంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం అందజేసి సమావేశాలను నిర్వహించి సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆదేశించారు.

సూచనలు ఇలా...

- సమావేశానికి విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలి.
- హెచ్‌ఎం పర్యవేక్షణలో క్లాస్ టీచర్, పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి.
- విద్యార్థుల వ్యక్తిగత ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపి సలహాలు అందించాలి.
- పురోగతి, హాజరు, పిల్లల ప్రవర్తన, మూల్యాంకనం ఇతర అంశాలను తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులతో చర్చించాలి
- చర్చించిన అంశాలను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు(తరగతి టీచర్) రికార్డ్ చేసి మినిట్స్ తయారు చేయాలి
- తయారు చేసిన అంశాలను ఎంఈవో, డీఈవోకు పంపించాలి.

కలిగే ప్రయోజనాలు..

- పాఠశాలతో సమాజం, విద్యార్థుల తల్లిదండ్రులతో అనుసంధానానికి దోహదం చేస్తుంది.
- విద్యార్థుల పురోగతిపై క్రమం తప్పకుండా చర్చలు జరపడం వల్ల వారికి అందించాల్సిన సహకారం, రోజువారీ ఇంటి పనులు, పాఠ్యపుస్తకాల వినియోగం తదితరాలను తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- పాఠశాల అభివృద్ధి, విద్యాపరమైన పురోగతిలో తల్లిదండ్రులు భాగస్వాములవుతారు.
- పిల్లల హాజరు, ప్రవర్తనా సమస్యలు, ఆసక్తులు పరస్పరం గ్రహించే వీలుంటుంది.
- పిల్లల చదువు, పరీక్ష ఫలితాలు తెలుసుకోవడంతోపాటు మధ్యాహ్న భోజనం అమలు తీరును తల్లిదండ్రులు స్వయంగా పర్యవేక్షించవచ్చు. దీంతో నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

అందరి భాగస్వామ్యం ఉండాలి



బంగారు భవిష్యత్‌కు దారి చూపే పాఠశాలల్లో అందరి భాగస్వామ్యం ఉంటే ఆ అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పీటీఎంలతో అందరూ భాగస్వాములవుతారు. ఇది వినూత్నమైన కార్యక్రమం. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని సూచనలిచ్చాం. సమావేశ నిర్వహణలో మినిట్స్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలి. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవు.
– విజయేంద్రరావు, డీఈఓ

షెడ్యూల్ ప్రకారం



అన్ని మండలాల్లో పకడ్బందీగా సమావేశాలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ సమావేశాల నిర్వహణలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎలాంటి అలసత్వం వహించొద్దు. ప్రస్తుతం ఫార్మెటివ్ అసెస్‌మెంట్, సీబీఏ–1 పరీక్షల తర్వాత ఈ ఏడాదిలో ఈనెల 10 తేదీన మొదటి సమావేశం నిర్వహించనున్నాం.
–పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్ష శాఖ

ప్రభుత్వ నిర్ణయం చాలా మంచిది




నా కుమారుడు వాహీద్ సోమల జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్నాడు. విద్యార్థుల చదువు, వారి భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. నెలకోసారి పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల చదువుతోపాటు ఇతర విషయాలను తెలుసుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది.పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకోవచ్చు.
– షేక్ ఫిర్దోస్, విద్యార్థి తల్లి, సోమల మండలం

గతంలో పట్టించుకునే వారే కాదు



నా కుమార్తె డింపుల్ ప్రియ సోమల ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. నా భార్య హరిణి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌గా పనిచేస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదు. టీడీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకునేవారు కాదు. విద్యార్థుల ప్రగతిని తెలియజేసేందుకు నిర్వహిస్తున్న పేరెంట్స్ టీచర్స్‌మీటింగ్‌లు ఎంతో ఉపయోగం.
– కుమార్‌రాజా, విద్యార్థిని తండ్రి, సోమల

నులిమేద్దామిలా..



నులిపురుగులు కంటికి కనిపించకుండా పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ రక్తహీనతకు గురిచేస్తుంది. కొంకి పురుగులు, నట్టలు(ఏలికపాములు)తోపాటు ఈ నులిపురుగులు 38 శాతం అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న వైద్య నిపుణులు చెబుతున్నారు. 5 నుంచి 18 ఏళ్ల లోపు వారే నులిపురుగుల సమస్యతో బాధ పడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వీటిన్నంటికీ అపరిశుభ్రతే కారణం. జిల్లా వ్యాప్తంగా గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఇందుకు ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

నులిపురుగుల వ్యాప్తి ఇలా

- కలుషిత, ఈగలు వాలిన పదార్థాలు తినడం
- వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన చేతి గోళ్ల ద్వారా
- బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, చెప్పుల్లేకుండా మరుగుదొడ్ల వాడకం
- అపరిశుభ్ర పరిసరాల్లో పిల్లలు ఆడుకునేటపుడు



రక్తహీనతతో ..

- నులిపురుగులు పేగుల్లోని రక్తాన్ని పీల్చి, వృద్ధి చెందుతాయి.
- దీంతో రక్తహీనత కలిగి, నీరసించి పోతారు.
- ఆయాసం, దగ్గుతో ఇబ్బంది పడతారు. పిల్లల బరువుతోపాటు ఎదుగుదల తగ్గిపోతుంది.
- చర్మంపై దద్దుర్లు వస్తాయి.
- తరచూ కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, ఆకలి మందగించడం తదితర లక్షణాలు వేధిస్తాయి.
- చదువులో ఏకాగ్రత లోపించి, నేర్చుకునే సామర్థ్యం తగ్గిపోతుంది.

- చిన్నారుల్లో రక్తహీనత కలిగిస్తున్న నులి పురుగులు
- నులి పురుగుల నిర్మూలన దినోత్సవం రేపు
- పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లాలో 19 ఏళ్ల లోపువారు 3,63,556 మంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

చిత్తూరు రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లాలో పది రోజుల పాటు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఇందుకు ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. నులిపురుగుల కారణంగా పిల్లలను, గర్భిణులను రక్తహీనత పీడిస్తోంది. ఇందుకు అపరిశుభ్రతే కారణం. పరిశుభ్రత, అవగాహనతో నులిపురుగులను నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలోని 36 మండలాల్లో 19 ఏళ్ల లోపు వయసున్నవారు 3,63,556 మంది పిల్లలున్నారు. 5,237 ప్రభుత్వ బడులు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నారు. ఇందుకు గాను 4వేల మంది ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను నియమించారు. విద్యా శాఖ, ఐసీడీఎస్‌ను సైతం భాగస్వామ్యం చేశారు. వీరి ద్వారా అందించేందుకు ముందుగానే మాత్రలు అందించారు.

జిల్లా సమాచారం ఇలా.

	పాఠశాలల	పిల్లల సంఖ్య
అంగన్‌వాడీకేంద్రాలు	2,420	76,457
ప్రభుత్వ బడులు	2,680	24,0981
కళాశాలలు	137	43,486
బడి బయట పిల్లలు	2,632	

మాత్రల పంపిణీ ఇలా

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ప్రతి చిన్నారికి అల్బెండజోల్ మాత్రను అందించనుంది. ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆరేళ్ల నిండి 19 ఏళ్ల లోపు ఉన్న వారికి స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఏడాది నుంచి రెండేళ్ల వయసున్న చిన్నారులకు 200 మిల్లీగ్రాములు(అర్థ)మాత్ర, రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వారికి 400 మిల్లీగ్రాములు చొప్పున మింగాల్సి ఉంటుంది.

నిర్లక్ష్యం వద్దు..



నులిపురుగుల నివారణ మాత్రలు మింగించడంలో నిర్లక్ష్యం వద్దు. విధిగా వైద్య బృందం, పాఠశాల బృందం మాత్రలు పంపిణీ చేయాలి. భోజనం తర్వాత దగ్గరుండి మింగించాలి. పిల్లలకు ఆరోగ్య సమస్య ఉంటే ముందుగానే గుర్తించి..డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. అలాంటి పిల్లలకు ఆ తర్వాత మాత్రలు ఇవ్వాలి. అన్ని పాఠశాలలకు ఈ మాత్రలు ఇప్పటికే సరఫరా చేశాం. కచ్చితంగా ప్రతి పిల్లవాడు ఈ మాత్ర వేసుకోవాలి. నులి పురుగుల నియంత్రణకు తల్లిదండ్రులు సహకరించాలి.
–సుదర్శన్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్

నేటి నుంచి మన భూమి–మన దేశం

- పకడ్బందీగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షణ్మోహన్


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం పలు శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం నుంచి నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలో నిర్ణయించిన విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొనేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. పాల్గొనే వారందరూ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని, తాము తీసుకునే సెల్ఫీలను అందులో అప్లోడ్ చేయాలని చెప్పారు. ర్యాలీ నిర్వహించి నా భూమి– నా దేశం శిలాఫలకం ప్రారంభించి, 75 మొక్కలు నాటి, మట్టితో దీపాలు వెలిగించి ప్రతిజ్ఞ చేయాలన్నారు. స్వాతంత్ర సమర యోధులు ఉంటే సన్మానించాలని పేర్కొన్నారు. ఆ గ్రామ పరిధిలో మట్టిని సేకరించి మండలాలకు పంపాలని, మండలాలకు వచ్చిన మట్టిలో నుంచి కొంత భాగాన్ని నియోజక వర్గాల పరిధికి పంపాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, డీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్, పక్కన జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులైన మైనారిటీలందరికీ సంక్షేమ పథకాలు అందజేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, పీఎం 15 సూత్రాల పథకంపై డీఆర్వో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీలకు సంబంధించి చిత్తూరులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మరో మైనారిటీ వసతి గృహాన్ని మదనపల్లె నుంచి చిత్తూరుకు త్వరలో మార్పు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మైనారిటీ యువతీ యువకులు మంచి అవకాశాలు అందిపుచ్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ఉన్న పలు మసీదులను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖాధికారి చిన్నారెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, డీఆర్‌డీఏ ఏపీవో రవి, కమిటీ సభ్యులు అఫ్జల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

యాళి వాహనంపై కుమారస్వామి విహారం


యాళివాహనంపై ఊరేగుతున్న దేవదేవేరులు

శ్రీకాళహస్తి: శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి మంగళవారం యాళి వాహనంపై పురవీధుల్లో విహరించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీచెంగల్వరాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను యాళి వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

ప్రసూతి సేవల్లో అవినీతిని సహించం


సిబ్బందికి సూచనలిస్తున్న అరుణ్‌కుమార్

చిత్తూరు రూరల్: ప్రసూతి సేవల్లో ఫిర్యాదులువస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి విభాగాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెలివరీ సమయంలో డబ్బులు అడిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఆస్పత్రిపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో నిఘా పెట్టిందన్నారు.

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి


మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: మామిడి కోత తర్వాత మంచి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మ్యాంగో భవనంలో మామిడి కోత తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యానవనశాఖ, రైతు భరోసా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలో ఉద్యాన పంటల్లో అత్యధికంగా 55 వేల హెక్టార్లలో మామిడి పంట సాగవుతోందన్నారు. మామిడి కాయల కోత తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా ఖర్చు తగ్గించుకుని నాణ్యమైన ఉత్పత్తులు సాధించి, అధిక ధరలు పొందే అవకాశం ఉంటుందన్నారు. శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ కోత తర్వాత కొమ్మల కత్తిరింపులు చాలా ముఖ్యమని తెలిపారు. వర్షాలు రాగానే కలుపుతీసి దున్నడం ప్రారంభించాలన్నారు. ఈ సదస్సులో ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈచర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన చిట్టిబాబు

తవణంపల్లె: అతివేగంగా వచ్చిన ఈచర్ వాహనం ఢీకొని మండలంలోని దిగువ మారేడుపల్లెకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రుడు కథనం మేరకు మండలంలోని ఎగువమారేడుపల్లె దళితవాడకు చెందిన చిట్టిబాబు(52) మోటార్ సైకిల్‌పై సోమవారం తవణంపల్లె వారపు సంతకు వెళుతున్నాడు. మార్గమధ్యంలో మోటార్ సైకిల్‌ను అరగొండ వైపు నుంచి వేగంగా వస్తున్న ఈచర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చిట్టిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

టీడీపీ నేతల నిరసన

చిత్తూరు రూరల్: పుంగనూరు ఘటనలో అక్రమ కేసులు నమోదు చేస్తున్నారంటూ నగరంలోని దర్గా సర్కిల్‌లో బుధవారం టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సుమారు 150 మందిపై పోలీసులు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత నాయకులు మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడులోని పేర్నాంబట్ అంతర్రాష్ట్ర రహదారి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. మంత్రి పెద్దిరెడ్డి చొరవతో ఎమ్మెల్యే వెంకటేగౌడ పట్టుదలతో దశాబ్దాల రహదారి సమస్య తీరనుంది. రెండు రాష్ట్రాల సరిహద్దులో కేవలం అర్ధ కిలోమీటర్ ఇబ్బందిగా ఉన్న రోడ్డును త్వరలోనే అక్కడి ప్రభుత్వం వేయనుంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే బైరెడ్డిపల్లె, పుంగనూరు, మదనపల్లె పట్టణాలకు తమిళనాడు నుంచి రవాణా సౌకర్యాలు కలుగుతాయి. దీంతో ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది.



బైరెడ్డిపల్లె మండలంలో పేర్నాంబట్ అంతర్రాష్ట్ర రహదారి

30 గ్రామాలకు రవాణా సౌకర్యం

పలమనేరు మండలంలోని పెంగరగుంట నుంచి చెత్తపెంట దాకా ఇప్పటికే రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడినుంచి బాపలనత్తం, నెల్లిపట్లకు మట్టి రోడ్డు ఉంది. బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్ల మీదుగా తమిళనాడు రాష్ట్రంలోని అరట్లకు ఇప్పటిదాకా ఇబ్బందికరంగా రాకపోకలున్నాయి. బైరెడ్డిపల్లె నుంచి పేర్నాంబట్‌కు రోడ్డు సౌకర్యం వస్తే ఈ ప్రాంతం నుంచి 20 అటవీప్రాంత గ్రామాలకు తమిళనాడులోకి వెళ్లే సౌకర్యం వస్తుంది. మరోవైపు బైరెడ్డిపల్లె మండలంలోని పది గ్రామాలకు అత్యంత సమీపంగా తమిళనాడులోని మార్గం రానుంది.

అంతర్రాష్ట్ర రహదారికి మోక్షం

- తీరనున్న పలమనేరు వాసుల దశాబ్దాల సమస్య
- బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడుకు త్వరలో రాకపోకలు
- ఏపీ సరిహద్దు వరకు ఇప్పటికే రోడ్డు
- తమిళనాడు సరిహద్దులో అర్ధ కిలోమీటరు మాత్రమే పెండింగ్
- పనులు పూర్తయితే పేర్నాంబట్‌కు అరగంటే ప్రయాణం
- పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో పారిశ్రామికాభివృద్ధికి మార్గం

పలమనేరు: పలమనేరు వాసుల అంతర్రాష్ట్ర రహదారి దశాబ్దాల కల నెరవేరనుంది. పలమనేరు రెవిన్యూ డివిజన్ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. తమిళనాడు రాష్ట్రం నుంచి పలమనేరు ప్రాంతానికి దగ్గరి రహదారులున్నాయి. అయితే రాష్ట్ర సరిహద్దులో రోడ్డు పనులు దశాబ్దాలుగా ప్రారంభానికి నోచుకోలేదు. రెండు రాష్ట్రాల సరిహద్దులో కౌండిన్య అభయారణ్యం ఉంది. దీంతో ఈ రహదారులకు అటవీశాఖ అభ్యంతరాలతో ఇప్పటిదాకా గ్రహణం పట్టుకుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడులోని పేర్నాంబట్‌కు దారి సమస్య త్వరలోనే తీరనుంది. ఇందుకు సంబంధించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో గుడియాత్తం ఎమ్మెల్యే ద్వారా రహదారి సమస్య పరిష్కారం కానుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పనులు చేపట్టాలని ప్రజలు ఎంత విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. పలమనేరు నియోజకవర్గ అభివృద్ధి కోసమే టీడీపీలోకి వెళ్తున్నానని వైఎస్సార్‌సీపీని వీడి ఆపార్టీలో చేరి మంత్రి పదవిని దక్కించుకున్న మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఈ విషయాన్ని గాలికొదిలేశారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప మంత్రి పెద్దిరెడ్డి చొరవతో తమిళనాడుకు దగ్గరిదారి రానుంది.

రాష్ట్ర సరిహద్దులో అర కిలోమీటరే సమస్య

పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం మీదుగా పేర్నంబట్‌కు అడవి మార్గంలో రహదారి ఉంది. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె నుంచి కేవలం 17 కిలోమీటర్ల దూరమున్న ఈ రహదారి చాలా దగ్గరిదారి కావడంతో ఇది స్థానికులకెంతో సౌకర్యవంతంగా ఉంటుంది. బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడులోని పేర్నంబట్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం వీ.కోట మీదుగా లేదా పలమనేరు నుంచి గుడియాత్తం వెళ్లి 60 కిలోమీటర్లు చుట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. బోర్డర్‌లో అరకిలోమీటర్ నిర్మాణం గనుక పూర్తయితే కేవలం అరగంటలో బైరెడ్డిపల్లి నుంచి పేర్నంబట్‌కు చేరుకోవచ్చు. బైరెడ్డిపల్లె నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు ఇప్పటికే తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. మరోవైపు పేర్నంబట్ నుంచి తమిళనాడు ప్రభుత్వం వారి సరిహద్దు వరకు పక్కా రోడ్డు నిర్మించింది. అయితే కౌండిన్య అటవీ ప్రాంతంలో మన రాష్ట్ర పరిధిలో ఓ కిలోమీటరు, తమిళనాడు పరిధిలో అర కిలోమీటర్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఎట్టకేలకు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లోని ప్రజాప్రతినిధులు నడుం బిగించడంతో అంతరాష్ట్ర రోడ్డు సమస్య సుగమనం కానుంది.

నెరవేరనున్న దశాబ్దాల కల



బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడులోని పేర్నంబట్‌కు కడపనత్తం, నెల్లిపట్లల మీదుగా రెండు దగ్గరి మార్గాలున్నాయి. ఇరు రాష్ట్రాలలోని సరిహద్దుల వరకు ఆయా రాష్ట్రాల బస్సు సౌకర్యం ఉంది. కేవలం కిలోమీటర్ రోడ్డు సమస్య తీరితే అంతరాష్ట్ర బస్సు సర్వీసులు వస్తాయి. ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది. ఇది ఈ ప్రాంత వాసులు దశాబ్దాల కల. ఇన్నాళ్లకు మా కల నిజం కానుంది.

– విశ్వమోహన్, వ్యాపారి, బైరెడ్డిపల్లె

త్వరలోనే రాకపోకలు



తమిళనాడులోని పేర్నాంబట్ నుంచి వయా బైరెడ్డిపల్లె మీదుగా మదనపల్లెకు బ్రిటీష్ వారు వేయించిన రోడ్డు ఇది. రెండు రాష్ట్రాల ఘాట్‌లో దారి మూసుకుపోవడంతో ఇన్నాళ్లు ఇబ్బంది వచ్చింది. మా పరిధిలోని రెండు కిలోమీటర్లు సీసీ రోడ్డు వేయిస్తాం. గుడియాత్తం ఎమ్మెల్యేతో మాట్లాడి అక్కడి ప్రభుత్వం ద్వారా కొంత రోడ్డు పనులు చేయించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరాం. త్వరలోనే రాకపోకలు జరగనున్నాయి.

– మొగసాల రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లె



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న జేసీబీ

- ఉపాధ్యాయురాలికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చాముండేశ్వరి

బైరెడ్డిపల్లె : పుంగనూరు–బైరెడ్డిపల్లె జాతీయ రహదారిలోని రామనపల్లె వద్ద మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీకొన్న ప్రమాదంలో ఉపాధ్యాయురాలికి తీవ్ర గాయాలయ్యాయి. పుత్తూరు మండలం తుంబూరు గ్రామానికి చెందిన నరేష్ భార్య చాముండేశ్వరి బైరెడ్డిపల్లె మండలం గడ్డిండ్లు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. పాఠశాల విధులు ముగించుకుని బైరెడ్డిపల్లెకు ద్విచక్రవాహనంపై చాముండేశ్వరి వస్తుండగా రామనపల్లె వద్ద జేసీబీ ఢీకొంది. ఈ ఘటనలో చాముండేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

పూతలపట్టు: మండలంలోని కొత్తకోట ఐఓసీ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం సర్వీస్ రోడ్డును దాటుతుండగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు స్థానిక రామాపురం రోడ్డుకు చెందిన గిరి పి.కొత్తకోట వైపు నుంచి పూతలపట్టుకు సర్వీస్ రోడ్డు మార్గంలో బైక్‌పై బయల్దేరాడు. ఇదేక్రమంలో చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరుకు చెందిన చందు, యోగేష్ వేము ఇంజినీరింగ్ కళాశాలకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. కొత్తకోట ఐఓసీ పెట్రోల్ వద్ద సర్వీస్ రోడ్డును దాటుతుండగా ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చందు, యోగేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. గిరికి ముఖంపై గాయాలయ్యాయి. తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం



రామకుప్పం : సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

రామకుప్పం/ శాంతిపురం : ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి సెప్టెంబర్ 15నాటికి పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం రామకుప్పం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో, శాంతిపురం మండల సచివాలయంలో పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, డిజిటల్ లైబ్రరీల భవనాలను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలన్నారు. బిల్లులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో లేకుండా అప్లోడ్ చేయాలన్నారు. వివిధ దశల్లో ఉన్న భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న పాలవెల్లువకు సంబంధించి వీఆర్‌ఓలు వలంటీర్లతో సమన్వయం చేసుకుని రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటీఎస్‌ను పూర్తి చేయాలని తెలిపారు. గత ప్రభుత్వం విజలాపురం సమీపంలో టైడిల్ సిల్క్ ఫ్యాక్టరీకి తీసుకున్న భూములకు రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు కోరారు. దీనిపై పూర్తి నివేదిక పంపాలని తహసీల్దార్ మురళిని జేసీ ఆదేశించారు. నా భూమి– నా దేశం కార్యక్రమంలో నిర్ణీత షెడ్యూలు ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశాల్లో పశు సంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ సత్యనారాయణ, తహసీల్దార్లు మురళీ, నరసింహులు, ఎంపీడీఓలు రాధాకృష్ణ, హేమమాలిని, ఎంపీపీ సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ రామకుప్పం మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఐదుగురికి జైలు



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

చౌడేపల్లె: మహిళపై దాడి చేయడంతోపాటు కులం పేరుతో దూషించిన కేసులో ఐదుగురికి ఆరునెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ చిత్తూరు మొదటి అడిషనల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రమేష్ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపతి పట్టణం చెన్నారెడ్డికాలనీకి చెందిన నాగలక్ష్మి 2014 సంవత్సరం జనవరి నెలలో సంక్రాంతి పండుగకు చౌడేపల్లె మండలం గోనలకురప్పల్లెలోని బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ ఏర్పడి ఘర్షణలో అదే ప్రాంతానికి చెందిన మోహన్, హరీష్, వినయ్, చక్రపాణి, పాల చిన్నబ్బ దాడికి పాల్పడడంతోపాటు ఆమెకు కులంపేరుతో దూషించారు. కేసు తుది విచారణలో నేరం రుజువుకావడంతో నిందితులు ఒకొక్కరికి ఆరునెలలు జైలు, వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రమేష్ తీర్పు నిచ్చారు. ఈకేసులో దర్యాప్తు అధికారిగా పలమనేరు డీఎస్పీ వై. హరినాథరెడ్డి వ్యహరించగా, కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాథరెడ్డి వాదించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణ

చంద్రగిరి(తిరుపతి రూరల్): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెల్లరేషన్ కార్డు ఉన్న 19 నుంచి 40 ఏళ్ల మహిళలు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం కల్పిస్తామని, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇస్తామని చెప్పారు. వివరాలకు 6301717672, 7989680587 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డిపో క్లర్క్, గ్యారేజ్ ఇన్‌చార్జీలకు మంగళవారం తిరుపతి ఆర్ఎం కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా అయిల్ ట్యాంకర్లు వచ్చినప్పుడు డీజిల్ చోరీ కాకుండా డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి జితేంద్రనాత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో టీబీసీ వరకు భక్తులు బారులు తీరారు. సోమవారం అర్ధరాత్రి వరకు 69,733 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,614 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.37 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

లాజికల్ థింకింగ్‌తో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

తిరుపతి ఎడ్యుకేషన్ : లాజికల్ థింకింగ్(తార్కిక ఆలోచన)తో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్లోని కౌటిల్య విద్యాసంస్థలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'స్టెప్ ఫర్ సక్సెస్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి యండమూరి మాట్లాడుతూ స్వీయ జ్ఞానంతో మనలోని శక్తిని తెలుసుకున్నప్పుడే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. లీడర్‌షిప్, కామన్‌సెన్స్, కమ్యునికేషన్, తెలివి ఉంటే జీవితంలో ఉన్నతంగా రాణించవచ్చని పేర్కొన్నారు. విజయ సాధనలో ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు వచ్చినా లక్ష్యం చేరేవరకు విశ్రమించకూడదని సూచించారు. అనంతరం బ్యాంకు, ఎస్ఎస్‌సీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్), క్యాట్ తదితర పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

వైభవంగా భరణి దీపోత్సవం



దీపోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



నెమలి వాహనంపై స్వామివారు

పాకాల : మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లె వద్ద ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మంగళవారం ఈ మేరకు ఆలయ అర్చకులు వైభవంగా భరణి దీపోత్సవం నిర్వహించారు. ముందుగా ఉదయం యాగపూజ, భరణి అభిషేకం, షణ్ముఖ సహస్రనామార్చన, మహామంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వైభవోపేతంగా భరణి దీపోత్సవాన్ని చేపట్టారు. రాత్రి స్వామివారిని విశేషంగా అలంకరించి మయూర వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. రాజేంద్రప్రసాద్, మద్దినేని శ్రీనివాసులనాయుడు కుటుంబసభ్యులు, రాయరెడ్డెయ్య చౌదరి, కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, చంటి పాల్గొన్నారు. సీఐ ఓబులేశు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బస్సులు

భక్తుల సౌకర్యార్థం ఆనందగిరికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచన మేరకు నెరబైలు నుంచి 3, ఐరాల – 3, రొంపిచెర్ల -5, పీలేరు-5, కల్లూరు-5, సదుం- 3, చంద్రగిరి- 5, సోమల-5, పుంగనూరు – 10 మొత్తం 44 బస్సులను ఊట్లవారిపల్లెకు నడపనుంది.

పరిపూర్ణం.. శ్రీమహాలక్ష్మి యాగం



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఘన్‌షాయామాచార్యజీ మహరాజ్

తిరుపతి కల్చరల్ : రాజస్తాన్ ఝులారియా పీఠాధిపతి 1008వ స్వామీజీ ఘన్‌షాయామాచార్యజీ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 225 కుండల శ్రీమహాలక్ష్మి మహా యాగ యజ్ఞం మంగళవారం మహా పూర్ణాహుతితో పరిపూర్ణమైంది. ఈనెల 3వ తేదీన ప్రారంభమైన మహాయజ్ఞం అత్యంత ఆధ్యాత్మిక శోభితంగా సాగింది. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు, పీఠాధిపతులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చివరి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 225 కుండల యజ్ఞ మండపాలలో వేద పండితులు పూజలు నిర్వహించి యజ్ఞోపధారణలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి యాగ మండపం వద్ద నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన యజ్ఞ పూజలు నిర్వహించి పీఠాధిపతి స్వామీజీ ఆశీస్సులు అందుకుని ప్రసాదం స్వీకరించారు. మధ్యాహ్నం శ్రీకన్వెన్షన్ హాల్లో కైలాస్ చంద్ర స్వామిజీ చేపట్టిన శ్రీమద్ భాగవత ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో యాగ యజ్ఞ కో–ఆర్డినేటర్ కుప్పాల గిరిధర్‌కుమార్, యాగ కమిటీ సభ్యులు శ్రీధర్, నవీన్ మహేశ్వరి, సంజయ్ సరదా, సంజయ్ మొదని, మధుసూదన్, వేణుగోపాల్, అనురాగ్ జాజు, సౌబహుద్ కాకాని, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమన పూజలు

శ్రీ మహాలక్ష్మి మహా యాగ యజ్ఞం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మండపానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాగం నిర్వహణ వేద పండితులు. ఝులారియా పీఠాధిపతి ఘన్ యామాచార్య మహారాజ్ ఆశీస్సులు అందుకున్నారు.